



కలెక్టరేట్ వద్ద ఆందోళనలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

రాష్ట్రానికి బిజెపి ద్రోహం


- విభజన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం
- విశాఖ పర్యటనకు వస్తున్న మోడీని నిలదీయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గడిచిన పది సంవత్సరాలుగా తీరని ద్రోహం చేస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప విమర్శించారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసి ఏ మొహం పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి, ప్రధాని మోడీ పర్యలనకు నిరసనగా సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసనలో ఓ.నల్లప్ప మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్ర, రాయలసీమ వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, విద్యాసంస్థలు, వైద్య సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారన్నారు. విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను రూ.20 వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో, ప్రత్యక్షంగా 25 వేలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిపిస్తామని చెప్పారన్నారు. గత పది సంవత్సరాలుగా ఈ మాటలు చెప్పి ఇప్పుడు కడప ఉక్కు మా పరిశీలనలేదని చేతులెత్తేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఊతకర్రల సహాయంతో మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉన్నా రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేస్తోందంటే అందుకు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలే కారణం అన్నారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు సుమారు రెండు సంవత్సరాలుగా కార్మికులు, ప్రజలు పోరాడుతున్న విశాఖపట్నానికి ప్రధాని మోడీ రావడం ఆంధ్రులను అగౌరపరచడమే అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని చెప్పి ఆంధ్రలో ప్రధాని పర్యటించడం తెలుగువారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడమే అన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు, బొగ్గు గనులు కేటాయించకుండా ఆ ప్రాంతంలోనే మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ఆలోచన చేయడం ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు ఏడు జిల్లాలకు జిల్లాకు రూ.50 కోట్లు చొప్పున ప్రకటించి మూడు సంవత్సరాల మాత్రమే ఇచ్చారన్నారు. వాటిని కూడా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. రాయలసీమ ప్రాంతానికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. జిల్లాలో ఖనిజ వనరుల ఆధారంగా పరిశ్రమలు, విద్యాభివృద్ధికి యూనివర్సిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్నారు. ఉద్యానవన పంటలకు ప్రసిద్ధి చెందిన రాయలసీమలో శీతల గిడ్డంగులు మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించి, చేనేత కార్మికులను వత్తిదారులను అదుకోవాలని డిమాండ్ చేశారు. వీటిన్నంటిపై ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖలో పర్యటిస్తున్న సందర్భంగా స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయాలన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మోడీపై ఒత్తిడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, బాలరంగయ్య, సావిత్రమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మన్నీల రామాంజనేయులు, ముర్తుజా, వెంకటనారాయణ, పరమేష్, నాగరాజు, నగర కమిటీ సభ్యులు ప్రకాశ్ రెడ్డి, వలి, ఇర్ఫాన్, ఆటో శీనా, ఓబులేసు, మండల కార్యదర్శులు చెన్నారెడ్డి, పోతులయ్య పాల్గొన్నారు.

ఆగస్టులో కరువు.. జనవరిలో పరిశీలన..!

- నేడు ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన
- నష్టం జరిగాక పరిశీలన
- ఇప్పుడైనా కరువు కనబడేనా..!



ఎండిన వేరుశనగ పంట (ఫైల్‌ఫోటో)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2024 ఖరీఫ్ సీజన్ ఆగస్టులో వర్షాభావం నెలకొంది. దీనికి సంబంధించి కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. అనంతపురం జిల్లాలో ఏడు, సత్యసాయి జిల్లాలో పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ కరువు పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం ఇప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేయనుంది. బుధవారం ఉదయం సత్యసాయి జిల్లాలో పర్యటించనుండగా, సాయంత్రం అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. కరువు ముగిసినా ఆర్నెళ్ల తర్వాత ఈ బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో పంట నష్టం ఏ రకంగా అంచనా వేయనుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆగస్టు తరువాత జిల్లాలో అధిక వర్షాలు పడటంతో పచ్చదనం నెలకొంది. అంతేకాకుండా వేరుశనగ తదితర పంటలను ఇప్పటికే తొలగించారు. ఇప్పుడు ఈ నష్టం కరువు బృందానికి కనిపిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. అనంతపురం జిల్లాలో నార్పల, అనంతపురం, బుక్కరాయసముద్రం. గార్లదిన్నె, యాడికి, విడపనకల్లు, రాప్తాడు మండలంలో కరువు నెలకొంది. ఇందులో 12,856 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు అంచనా వేసి రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. సత్యసాయి జిల్లాలో తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి మండలాల్లో కరువు నెలకొంది. ఈ మండలాల్లో 45,848 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. రూ.62.64 ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని ప్రతిపాదించారు.

కరువు కనిపించేనా .?

ఈ ఏడాది ఎప్పుడూలేని విధంగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో జూన్ నుంచి సెప్టంబర్ వరకు చూస్తే ఒక్కో నెల ఒక్కో రకమైన వాతావరణం నెలకొంది. అనంతపురం జిల్లాలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 61 మిల్లీమీటర్లు అయితే 147.7 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 142 శాతం అధికంగా వర్షం పడింది. అదే జులై నెలలో చూస్తే సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4 మిల్లీమీటర్ల మాత్రమే నమోదవగా, -61 శాతం వర్ష పాతం లోటుంది. ఆగస్టు మూడవ వారం వరకు కూడా వర్షాభావ పరిస్థితులే జిల్లాలో నెలకొన్నాయి. ఆ తరువాత మూడవ వారం నుంచి వర్షాలు అధికంగా పడ్డాయి. ఈ నెల మొత్తంగా చూసినప్పుడు సాధారణం కంటే గణనీయంగా వర్షపాతం పడినట్టు కనిపిస్తుంది. ఆగస్టు నెల సాధారణ వర్షఫాతం 83.8 మిల్లీమీటర్లు అయితే 210.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. 210 శాతం అధికంగా వర్షపాతం పడింది. పడిన వర్షపాతం అదును దాటాక రావడంతో జరిగాల్సిన నష్టం అప్పటికే జరిగింది. ఇక సెప్టంబరు సాధారణ వర్షపాతం 110.9 మిల్లీమీటర్లు అయితే 48.4మిల్లీమీటర్లు పడింది. మళ్లీ ఈనెలలో సాధారణంలో 54 శాతమే పడింది. ఇలా వర్షాలు రావడంలో వ్యత్యాసాలు రైతులను నష్టాలపాలుజేశాయి.

పరిహారం అందించేరా..?

వర్షాల్లో నెలకొన్న వ్యత్యాసాలను ఇప్పుడు కేంద్ర కరువు బృందం ఏరకంగా పరిశీలన చేస్తుంది అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కరువుతో రైతులు పూర్తిగా నష్ట పోయిన అన్ని పరిస్థితులను ఎలా అధ్యయనం చేయనున్నారో నేడు తేలనుంది. అన్ని అంశాలను గుర్తించి పంట నష్టంకు సంబంధించి పరిహారం అందిస్తారా.. లేదా.. అన్నది వేచి చూడాల్సి ఉంది.





ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న నందమూరి అభిమాన సంఘాల నాయకులు

రేపు 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈ నెల 9వ తేదీన అనంతపురం నగరంలో నిర్వహిస్తున్నారు. నగర పరిధిలోని శ్రీనగర్ కాలనీ అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ జగదీష్, చిత్ర యూనిట్, నియోజకవర్గ టిడిపి నాయకుడు గంగారామ్, ఎన్‌బికె హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్, నందమూరి అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మొద్దీన్ తదితరులు మంగళవారం పరిశీలించారు. ఈవెంట్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకునేలా అధికారులు, నందమూరి అభిమాన సంఘాల నాయకులు చర్యలు తీసుకుంటున్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సిడి ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రులు, జిజిహెచ్ రక్తనిధి కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని తనిఖీ చేసి, రోజుకు ఎంతమంది రెడ్ క్రాస్ నుంచి రక్తం తీసుకు వెళుతున్నారు, మౌలిక సదుపాయాలు, టెక్నికల్ సిబ్బంది ఎంతమంది ఉన్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ హోమియో వైద్యశాలను తనిఖీ చేసి మందులు సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై అక్కడున్న రోగులతోనూ మాట్లాడారు. సిడి ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాలు, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపరతికి రోజుకు 300 నుంచి 400 మంది రోగులు వస్తున్న నేపథ్యంలో అవసరమైతే మరింత మంది డాక్టర్లను నియమిస్తామన్నారు. శారద నగర్‌లో ఉన్న క్యాన్సర్ యూనిట్‌ను తనిఖీ చేసి వైద్య సేవలు, సదుపాయాల కల్పనపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్)లోని రక్తనిధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డా॥ఈబి.దేవి, డిసిహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఒ హేమలత, ఆర్ఎంవో పద్మజ, డ్రగ్స్ ఏడీ రమేష్ రెడ్డి, రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్‌తో పాటు వైద్యులు పాల్గొన్నారు.



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

దీర్ఘకాలిక సెలవుపై ఎఫ్‌ఎసి కమిషనర్

- ఒత్తిడిలో పనిచేయలేను తప్పించండి...
- డిఎంఎకు కమిషనర్ వినతి అందజేత
- నెలరోజుల వ్యవధిలో దీర్ఘకాలిక సెలవుపై ఇద్దరు కమిషనర్లు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎఫ్‌ఎసి కమిషనర్ రామలింగేశ్వర్ కూడా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. నెలరోజుల కాల వ్యవధిలోనే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇద్దరు కమీషనర్లు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటం పెద్ద చర్చకు దారితీస్తోంది. ఇటీవల ఎఫ్‌ఎసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పట్టి నుంచి రామలింగేశ్వర్ ముఖ్య నేతలు ఫోన్ చేసిన ఎత్తడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అత్యవసరమైన సమయాల్లో సైతం ఎఫ్‌ఎసి కమిషనర్ ఫోన్లను పీఏల చేతికి ఇచ్చి వారితోనే సమాధానాలు చెప్పించడంపై ముఖ్య నేతలు ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. పది రోజుల క్రితం ఓ ముఖ్య నేత కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడేందుకు ప్రయత్నించగా కనీసం ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంపై ఆ నేత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. విజయవాడ మీటింగ్‌కు వెళ్లిన కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఆ నేత ఫోన్ చేసి కమిషనర్ రామలింగేశ్వర్‌ను మాట్లాడించాల్సిందిగా ఆదేశించాల్సి పరిస్థితి వచ్చింది. సదరు నేత ఫోన్‌లో కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విధి నిర్వహణలో పక్షపాత ధోరణితో వ్యవహరించటం సరికాదని, ఒకరికి తొత్తుగా పనిచేసేటట్లయితే వెంటనే వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.



అదనపు కమిషనర్‌గా ఉంటూ ఉద్యోగుల బదిలీల్లో పెద్ద ఎత్తున వసూళ్లు చేపట్టినట్లు ఆరోపణలు రావడం, ఒక నేతకు అనుకూలంగా వ్యవహరిస్తూ నెలవారి మామూళ్లు అందజేసేలా పంచాయితీ జరిపినట్లు ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఎసి కమిషనర్ రామలింగేశ్వర పనితీరు వివాదాస్పదంగా మారింది. నేతల ఒత్తిళ్లతో పాటు ముళ్లకిరీటం లాంటి కమిషనర్ ఉద్యోగం చేయడం కష్టమని భావించి తనను ఎఫ్‌ఎసి కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ పది రోజుల క్రితం మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్‌కు వినతి అందజేశారు. అదనపు కమిషనర్‌గా ఉంటే ఎలాంటి ఒత్తిళ్లు ఉండవన్న అభిప్రాయంతో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.

15 రోజుల పాటు సెలవు...

ఎఫ్‌ఎసి కమిషనర్ బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించే దిశగా మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇదే సమయంలో అధికార పార్టీ ఒత్తిళ్లు పెరగడంతో మంగళవారం నుంచి ఎఫ్‌ఎసి కమిషనర్ 15 రోజుల పాటు సెలవుపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టి నెలరోజుల కూడా గడవకనే కాలవ్యవధిలోనే ఎఫ్‌ఎసి కమిషనర్ రామలింగేశ్వర్ సైతం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం ఇప్పుడు కార్పొరేషన్‌లో పెద్ద చర్చకు దారితీస్తోంది. ఇదే సమయంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బదిలీపై వచ్చేందుకు అధికారులెవరూ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. సూపరిండెంట్ ఇంజినీర్ భాస్కరరావుకు ఎఫ్‌ఎసి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. ఆయన ఏడాది ముందుగానే ఉద్యోగ విరమణ చేసేందుకు వాలంటరీ రిటైర్మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. త్వరలో ఆయన విఆర్‌ఎస్ తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయన ఎఫ్‌ఎసి కమిషనర్ బాధ్యతలు చేపట్టే అవకాశం దాదాపు లేనట్లే. ఆయన కాకుంటే నూతన కమిషనర్‌గా ఎవరు వస్తారు అన్న అంశంపై కార్పొరేషన్‌లో సందిగ్ధత నెలకొంది.

జవాబుదారీతనం అవసరం



వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కోర్టు కేసుల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులకు జవాబుదారీతనం వ్యవహరించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో కోర్టు కేసులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో నోడల్ అధికారులను నియమించామన్నారు. కోర్టు కేసుల పరిష్కారంలో ఆయా శాఖల పరిధిలో ఏర్పాటు చేసిన బృందాలు పని కీలకం అన్నారు. అందరూ సమన్వయంతో పరిపూర్ణంగా కోర్టు కేసులను పరిష్కారం చేయాలన్నారు. కేసుల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ రూల్ పొజిషన్ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ ఎ.మాలోల, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ వసంతలత, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, ఆయా శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

11 నుంచి రీసర్వే : ఆర్డీవో

ప్రజావక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రభుత్వ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఈనెల 20వతేదీ నుంచి చేపట్టనున్న రీసర్వేకు రైతులు సహకరించాలని ఆర్‌డిఒ వసంతబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో రీ సర్వే కోసం నాలుగు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బృందం ప్రతి రోజు 20 ఎకరాలు మాత్రమే సర్వే చేస్తారన్నారు. సర్వేకు వచ్చే ముందు సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇవ్వాలి

రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిరంతరం కరువుకు గురవుతున్న జిల్లా రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను రైతులకు 90 శాతం రాయితీతో ఇవ్వాలని పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఎపిఎంఐపి పీడీ, ఉద్యానశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, పదెకరాల లోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పండ్లతోటల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని, ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని, అన్నిరకాల పండ్ల మొక్కలను 90 శాతం రాయితీతో ఇవ్వాలని, పండ్లతోటల రైతు రుణాల మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం, పండ్లతోటల సంఘం నాయకులు

ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, పండ్లతోటల రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదన్, సహాయ కార్యదర్శి చెన్నారెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాజారామిరెడ్డి, బిహెచ్.రాయుడు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య కె.శ్రీనివాసులు, వి.కొండారెడ్డి, రమేష్, చిదంబరమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం క్రైం : స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు 7వ రోజు మంగళవారం కూడా కొనసాగాయి. ఎస్పీ పి.జగదీష్ దగ్గరుండి సిసికెమేరాల పర్యవేక్షణలో దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు నియమ నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బంధీగా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, ఛాతీ కొలతల అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షల్లో పురుష అభ్యర్థులు పాల్గొన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని మెరిట్ ఆధారంగానే ఈ ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులకు ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈనెల 16న షెడ్యూల్ ప్రకారమే కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయన్నారు.

ప్రాథమిక గొర్రెల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

బెలుగుప్ప : మండల పరిధిలోని అనిమిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. సంఘం అధ్యక్షులుగా తిప్పన్న, ఉపాధ్యక్షులుగా శ్రీరాములుతోపాటు మరో ఐదుగురు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ నవీన్‌కుమార్, పశుసంవర్ధక సహాయకులు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం ఉరవకొండలోని జిల్లా పరషత్ ఉన్నత పాఠశాలలో (సెంట్రల్) ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శు నందు, హరూన్ రషీద్, ఉపాధ్యాయులు మారుతి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శివ, వంశీ, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి ప్రతిభ

అమెరికా నుంచి రూ.45 లక్షల పెట్టుబడి సాయం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకామ్ తతీయ సంవత్సరం చదువుతున్న కె.యస్వంత్ రెడ్డి అద్భుత ప్రతిభ చాటాడు. అతను స్థాపించిన ధన్విన్ ఎకో వుడ్స్ స్టార్టప్‌కు అమెరికాకు చెందిన బ్లూఫ్లుట్ వెంచర్స్ ఎల్ఎల్‌సి నుంచి రూ.45 లక్షల పెట్టుబడిగా లభించింది. ఇదే విద్యార్థికి 2023లో అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ ఎస్‌కె యునివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్టప్ జాతర కార్యక్రమంలో బెస్ట్ స్టార్టప్ అఫ్ ది ఇయర్ ప్రశంసాపత్రం పొందారు. అప్పట్లో స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం ద్వారా రూ.5లక్షల పెట్టుబడి సాయం పొందాడు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ చక్రధర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సాధించిన ప్రతిభ ఎంతో గొప్పదన్నారు. ప్రతి విద్యార్థీ వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లి మంచి విజయాలు సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ఎన్ఎవి.ప్రసాద్, ఏవో శ్రీనాథ్, డా॥ఎస్.రిజ్వానా బేగం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎంఆర్‌పి ధరకే ఎరువులు విక్రయించాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-నార్పల

ఫర్టిలైజర్స్ దుకాణదారులు ఎంఆర్‌పి ధరకే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పురుగు మందుల స్టాకు, దుకాణాల లైసెన్సులు, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులు కొన్న ప్రతిరైతుకూ తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఎంఆర్‌పి ధరలకే పురుగు మందులను విక్రయించాలన్నారు. కాల పరిమితి ఉన్న మందులనే విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా తిరుమల ట్రేడర్స్, సంకల్ప దుకాణాల్లో పురుగు మందుల నాణ్యతను తెలుసుకునేందుకు నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ కార్యక్రమంలో ఏడిఎ చెన్న వీరస్వామి, సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ విజయవాడ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌పూరి గోస్వామి, వ్యవసాయ అధికారులు వెంకట్‌కుమార్, ఆర్.రాకేష్, తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఉమామహేశ్వరమ్మ

వైద్య కళాశాలకు జర్నలిస్టు ప్రసాద్ పార్థివదేహం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు నందిని దేవప్రసాద్ (జెమిని ప్రసాద్) పార్థీవదేహాన్ని తోటి జర్నలిస్టులు మెడికల్ కళాశాలలోని అనాటమి విభాగానికి అందించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు మాట్లాడుతూ అన్నిదానాల్లోకెల్లా దేహదానం చాలా గొప్పదన్నారు. ఎంతో మంచి మనసు ఉంటే తప్ప అంత గొప్ప పని సాధ్యం కాదన్నారు. తన అక్షరాలతో ఎంతోమంది యువ జర్నలిస్టులకు జ్ఞానం అందించిన ప్రసాద్ వైద్య విద్యార్థులకు జ్ఞానం అందించడానికి తన మరణానంతరం దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించమనడం గొప్ప స్ఫూర్తిదాయకమన్నారు.

జర్నలిస్టు మృతికి సిపిఎం సంతాపం

సీనియర్ జర్నలిస్టు ప్రసాద్ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తీవ్ర సంతాపం తెలిపారు. ప్రసాద్ వామపక్ష ఉద్యమానికి, ముఖ్యంగా సిపిఎంకు ఎంతో అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. వ్యక్తిగతంగా తనతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారన్నారు. అలాంటి ఆయన మృతి బాధాకరమన్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రసాద్ పార్థీవదేహాన్ని మెడికల్ కళాశాలకు అందజేస్తున్న జర్నలిస్టులు

పలువురు నివాళి

అనంతపురం రూరల్ : సీనియర్ జర్నలిస్టు జెమిని ప్రసాద్ మృతికి పలువురు నాయకులు మంగళవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీత, టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎంఎస్‌జెఐఎ జిల్లా అధ్యక్షులు కె.ఆశోక్‌నాయక్, తదితరులు అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మెల్యే దగ్గుపాటి కార్యాలయంలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే సోదరుడు సుందర్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీ నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటే ఎసిబికి పట్టిస్తా..

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గత ప్రభుత్వంలో మాదిరి అధికారులు లంచాలకు పాల్పడితే తానే స్వయంగా ఎసిబికి పట్టిస్తానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారులు లంచాలకు అలవాటు పడి పేదల భూ రికార్డులు మార్చారని ఆరోపించారు. ఎందుకంటే పేద రైతుల భూ సమస్యలు రోజూ తన వద్దకు వస్తున్నాయన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తానే స్వయంగా ఎసిబి అధికారులకు ఫోన్ చేసి లంచగొండి అధికారులను పట్టిస్తానని హెచ్చరించారు. తన నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో అభివృద్ధికి సంబంధించి లెటర్ ప్యాడ్‌లు ఇచ్చానన్నారు. తనపై విశ్వాసం ఉంటే 40 రోజుల్లోపు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం అంగన్వాడి సెంటర్‌ను ప్రారంభించారు. తర్వాత సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపిపి వాల్మీకి మాధవి, మాజీ ఎంపిపి రాయల్ రామయ్య, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, జడ్పిటిసి కదరప్ప, నాయకులు బండారు ఆనంద్, లాయర్ కృష్ణారెడ్డి, జనసేన నాయకులు వాసగిరి మణికంఠ, డిఎల్‌డిఒ విజయలక్ష్మి, ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరి, మండల స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.


అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

శింగనమల క్రాస్‌లో బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

శింగనమల క్రాస్‌లోని మరువకొమ్మ వద్ద బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హామీ ఇచ్చారు. జాతీయ రహదారి 544-డి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శింగనమల క్రాస్ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేసే విషయమై మంగళవారం శింగనమల క్రాస్ వద్ద ఎమ్మెల్యే పరిశీలించారు. ఇందులో భాగంగా ఎన్‌హెచ్ 544-డి జాతీయ రహదారి పనులు ఎలా చేపడుతున్నారు.. సమస్య ఏంటి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శింగనమల క్రాస్ వద్ద ప్రజా రవాణా ఆగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శింగనమల క్రాస్ వద్ద కేవలం ప్రజా రవాణా కోసం అనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే బస్టాఫ్ ఏర్పాటు విషయమై ఉన్న అవకాశాలను ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. ఇక్కడ జాతీయ రహదారిని పిల్లలు, పెద్దలు దాటాలంటే ఇబ్బందులు పడతారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బ్రహ్మయ్య, టిడిపి నాయకులు పిఎల్ ఈశ్వర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ శాలిని, చితంబరి దొర, నాయకులు అట్టే రామాంజనేయులు, పసుపుల శ్రీరామ్‌రెడ్డి, జిసి.బాబు, సి.వెంకటేష్, ఆయకట్టు ఛైర్మన్ జి.సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ పత్రా గొల్ల ఎర్రిస్వామి, ఆయకట్టు ఛైర్మన్ చెంద్రాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూల చంద్రమోహన్, చెన్నయ్య, జడేజా, ముంతా వెంకటేష్, రహంతుల్లా, పెద్దన్న, బండమీదపల్లి చెంద్రాయుడు, బిజెపి మండల కన్వీనర్ ఓబిరెడ్డి, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

సిఒ, ఎస్‌జి, ఒఎస్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పౌర సరఫరాల శాఖ ఎండి వీరపాండియన్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌లు, డిఎం కార్యాలయాల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్‌లు, సెక్యూరిటీ గార్డులు, ఆఫీస్ సబార్డినేట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంపుదల చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీరపాండియన్‌ను విజయవాడలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో 15 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలు పని చేస్తున్నారని తెలిపారు. నిత్యావసర సరుకుల దరలు, విద్యుత్ ఛార్జీలు , పెట్రోల్ డీజల్ దరలు పెరిగాయని తెలిపారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందన్నారు. తక్షణమే వారందరిని రెమ్యూనిరేషన్ పెంపుదల కోసం ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బహిర్గతం చేయాలన్నారు. వారందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. టిఏ, డిఎలు చెల్లించాలన్నారు. సిఒ, అటెండర్‌లకు పని గంటలు నిర్ణయించాలన్నారు. ఇఎస్‌ఐ, కార్డులు ఇవ్వాలన్నారు. 1వ తేదిన వేతనాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎండి ప్రభుత్వం దీష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి సివిల్ సప్లయ్ కంప్యూటర్ ఆపరేటర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎన.జగదీస్, కార్యదర్శి బి.జాకీర్, నాయకులు ఈశ్వర్ ప్రసాద్, సంజీవ, అనుష్‌బాబు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


పాండియన్‌కు పూలకుండీని అందజేస్తున్న సిఐటియు నాయకులు

రథయాత్రను జయప్రదం చేయండి

ఎఐబిఎస్‌ఎస్ జిల్లా నాయకులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎఐబిఎస్‌ఎస్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఛారిటబుల్ ట్రస్టు (సేవాఘడ్), ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదిన నిర్వహిస్తున్న మాతా జగదాంబ, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ శాంతి సద్భావన రథ యాత్రను జయప్రదం చేద్దామని ఎఐబిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాలాజీనాయక్, పి.బాబునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎఐబిఎస్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వచ్చేనెల 13, 14, 15వతేదీల్లో ఉంటాయన్నారు. ఇందులో భాగంగా జనవరి 26న శాంతి సద్భావన రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతపురం రెండవ రోడ్డులోని బంజారా భవన్ నుంచి శాంతి సద్భావన రథ యాత్ర ప్రారంభమై టవర్‌క్లాక్ మీదుగా ఆదర్శ నగర్‌లోని మారెమ్మ దేవాలయం, నాయక్ నగర్‌లోని మారెమ్మ దేవాలయం వద్ద రథయాత్ర ముగుస్తుందన్నారు. అక్కడే భక్తులకు అన్న ప్రసాదాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాఘడ్ ట్రస్ట్ కోశాధికారి ఎస్‌సి.బాలానాయక్, ఎఐబిఎస్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రంగ్లా నాయక్, డాక్టర్ రమణ నాయక్, సేవామాల గురు రాజేంద్ర ప్రసాద్ గురుజి, ఏఐబిఎస్‌ఎస్ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శివమణి బాయి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు నాయక్, విజయలక్ష్మి బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నా క్లయింట్ అయిన శ్రీ కె.జావీద్, తండ్రి:లేట్ కె.ఇబ్రహీం, డి.నెం.6-693, ఆజాద్ నగర్, కె.ఎల్.డి. రోడ్డు, అనంతపురం నందు నివాసం వుంటున్నాడు. మా క్లయింట్ గారి తండ్రి అయిన లేట్ కె.ఇబ్రహీం గారికి హక్కు అనుభవంలో గల ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.7827/1991, తేది:13.11.1991 రిజిష్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ ఆటోలో పోవుచుండగా పోగొట్టుకొని పోయినది. ఈ విషయం బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. కావున తన వద్ద ఒరిజినల్ పత్రము నకలు మాత్రమే ఉన్నదని తెలుపుతున్నాము.కావున ఎవరికైనా ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి గురించి గానీ, సదరు పత్రం గురించి గాని ఆక్షేపణలు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల నాకు తెలుపగోరుచున్నారు. మరియు పై డాక్యుమెంట్ ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం ఆర్.డి.మరియు ఎస్.ఆర్.డి.కి చెందిన రాచానపల్లి గ్రామ పొలంలో రాచానపల్లి పంచాయితీ ఏరియాలో స.నెం.200/7 విస్తీర్ణము ఎ-సి॥ 18.00 పైకి ఎ-సి॥ 6.50 పైకి ఎ-సి॥4.33 ఈ పైకి ఎ-సి॥0.03 హెచ్.యస్. 0.012 ప్లాటు నెం.70, చెక్కుబంది: తూర్పు:రోడ్డు, దక్షిణం:ప్లాటు నెం.69, ఉత్తరం: ప్లాటు నెం.71, పడమర:ప్లాటు నెం.59.ఈ మధ్యగల తూరు-పడమర: 55 అడుగులు లేక 16.68 మీటర్లు, ఉత్తర-దక్షిణము: 23 3/4 అడుగులు లేక 7.20 మీటర్లు.

కె.వి.గిరిధర్, అడ్వకేట్, అనంతపురం.
డి.నెం.2-303, 3వ రోడ్డు, అంనతపురం.
సెల్:8919697124

గర్భకోశ చికిత్స శిబిరం

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని ముదిగల్లు గ్రామంలో మంగళవారం ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్.శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ 90శాతం ఖచ్చితత్వంతో పేయి దూడల పుట్టుకను ఉద్దేశించి లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భదారణ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, మున్సిపల్ కౌన్సిలర్ కుర్ల రాము, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ధనుంజయ, సత్యనారాయణరెడ్డి, డాక్టర్ ఎం.హరణి, ఎన్‌టి చౌదరి, సతీశ్, పుల్లారెడ్డి, హేమంత్, చంద్ర శేఖర్, పశు సంవర్ధక సహాయకులు, పశు వైద్య సిబ్బంది రామమూర్తి, రమణ, శివ, ఓంకార్ మరియు సత్యసాయి సేవ సమితి కన్వీనర్ వివేకానంద, రాంప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

రాప్తాడు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ పన్ను బకాయిలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTHAPURAMU
G.W.O.P. No:76/2024
(In tha matter of Oppoinment of Guardion to the person and property of the minor A.Yuvaraj)

Between:
Anantha Bhagyamma ...**Petitioner**
V/S
To Whom Soever it may Concern ...**Respondent**

"బహిరంగ ప్రకటన"

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నా కక్షిదారురాలైన Anantha Bhagyamma W/o A.Venkataramana అను ఆమె పై కోర్టులో తన మనమడుకు రావలసిన **రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఫ్యామిలీ పెన్షన్స్ మరియు గ్రాట్యూటి అమౌంట్** తీసుకోవడానికి మైనరు అయినటువంటి A.Yuvaraj వారి తల్లిగారైన A.Indraja W/o A.Nagabhushanam, KIML Company లో Sub Wiring Men ID No:STH 01713.Palasamudram Branch లో ఉద్యోగం చేస్తూ మరణించినది.అందువలన ఆ బెనిపిట్స్ పై తెలిపిన మైనరు తరుపున నేను తీసుకొనుటకు పై కోర్టులో అర్జీ వేయడమైనది.కావున ఎవరికైన ఆక్షేపణలు ఉన్నచో 20/01/2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.

(By Order of Tha Court)
A.NAGARJUNA REDDY
Advocate for the Petitioner,
Cell:9440874191

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారుడిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి-గుత్తి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. పట్టణంలోని పిఆర్‌ఆర్ ఎంబీఏ కళాశాల విద్యార్థి జై సాయి సుభాష్ ఇటీవల ఒడిశాలోని భువనేశ్వర్ లోని కిట్స్ యూనివర్సిటీ లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను చాటాడు. దీంతో మంగళవారం కళాశాలలో పిఆర్‌ఆర్ ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసన్న కుమార్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.శ్రీరాములు, డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల వల్ల ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సరిగా ఆలోచించడం ఎలా'పై అవగాహన

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మోడల్ స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం 'సరిగా ఆలోచించడం ఎలా' కార్యక్రపై ప్రిన్సిపాల్ పి.లావణ్య అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా జనవిజ్ఞాన వేదిక తాడిపత్రి కన్వీనర్ కె.సేతు రమేష్‌రెడ్డి జెవివి లక్ష్యాలు, కార్యక్రమాలను వివరించారు. జెవివి జాతీయ ఉపాధ్యక్షులు ఎవి రమణయ్య సరిగా ఆలోచించడం ఎలా? అనే అంశం సవివరంగా వివరించారు. కడప జిల్లా జన విజ్ఞాన వేదిక కల్చరల్ కమిటీ నాయకుడు వెంకటసుబ్బయ్య జెవివి పాటలు పాడి వినిపించారు. తర్వాత కడప జిల్లా జెవివి ప్రధాన కార్యదర్శి హరేరామ్ మ్యాజిక్‌షో చేశారు.


అవగాహన కల్పిస్తున్న జెవివి నాయకులు

వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోండి : సిపిఎం

డి.హీరేహాల్ : రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకిషోర్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్.లోకేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణకిషోర్‌రెడ్డి విధుల పట్ల అలసత్వం వహిస్తూ రైతులకు అందుబాటులో లేకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు ఏదైనా సమస్య తెలిపేందుకు కార్యాలయానికి వస్తే నిరీక్షించాల్సి వస్తోందన్నారు. ఆఖరికి రెవెన్యూ సదస్సులో అయినా విన్నవిద్దామని వస్తే అక్కడికి కూడా రాకపోవడం బాధాకరమన్నారు. అధికారి నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ శాఖ అధికారి నిర్లక్ష్యంపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

నేడు దుకాణాల వేలంపాట

రాయదుర్గం : పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తులో మంగళవారం మార్కెట్ ఆవరణలో షాపురూములకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ, బి బ్లాక్‌ల్లో 40 షాపు రూములను గుడ్‌విల్ (తిరిగి చెల్లించని) ప్రాతిపదికన వేలం పద్ధతిలో గది అద్దె నిర్ణయించనున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు రూ.1.50లక్షలు, గుడ్‌విల్, కనీస నెలసరి అద్దె రూ.3 వేలు, రూ.3లక్షల సాల్వెన్సీ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

క్రీడాకారులకు అభినందనలు

నార్పల : రాష్ట్రస్థాయి పాఠశాలల గేమ్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులను ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. అండర్-14 నెట్‌బాల్‌లో సాయిమాధవ కాంస్య పతకం, అండర్-17 నెట్‌బాల్‌లో రామచరణ, పశాంత్, బేస్‌బాల్‌లో హేమంత్‌కుమార్‌రెడ్డి, అండర్-17 సాఫ్ట్‌బాల్‌లో మున్నా, అండర్ 17 హాకీ నందు, మనోజ్, రామచరణ్, తేజ, అండర్-14 బేస్‌బాల్‌లో గురుప్రవీణ్, అండర్-14 సాఫ్ట్‌బాల్‌లో మహేష్ ప్రతిభ కనబరిచారు. అలాగే అండర్-14 హాకీలో మహ్మద్ అవేజ్ గోల్ కీపర్‌గా రాష్ట్రస్థాయిలో జిల్లా జట్లకు ప్రాతినిథ్యం వహించారు. ఆయా క్రీడాకారులను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, నసీమాబేగం, తదితరులు అభినందించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు మంగళవారం ఆకస్మికంగా తనికీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. క్రైమ్‌రేటును తగ్గించాలన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

నార్పల : రెండు కిడ్నీలు చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రంలోని ఉయ్యాలకుంటకు చెందిన తలారి పుల్లయ్యకు టిడిపి నాయకులు ఆకుల విజయకుమార్ (బాబు) మంగళవారం ఆర్థికసాయం అందించారు. ఇందులో భాగంగా పుల్లయ్య ఇంటికి వెళ్లి రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు సాలేహా, ప్రదీప్, ఇస్మాయిల్, నాగభూషణం, రామాంజనేయులు, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలతో సమావేశం

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని గ్రామంలో ఖచ్చితంగా రోజూ ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యాడికి సిహెచ్‌ఒ జుబేదా, పిహెచ్‌ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎల్‌బి కంప్యూటర్ సరిత, ఎఎన్‌ఎంలు, ఎల్‌ఎంహెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

ఉరవకొండ : వ్యాధి నిరోధక టీకాలపై రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్ ఎ ద్రావణం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, వైద్యసిబ్బంది, ఆశాలు, తదితరులుపాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు.. లాభదాయం

ప్రజాశక్తి-శింగనమల

నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంతో సాగు చేసే అధిక దిగుబడులు సాధించి లాభదాయకంగా ఉంటుందని శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు పొలాలను లోతుగా దుక్కులు చేయడం వల్ల భూమిలో ఉన్న శత్రువు పురుగులు బయటపడి చనిపోయే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పంటలకు తెగులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. పురుగు మందులు తగ్గించి సేంద్రీయ ఎరువులతో అధిక దిగబడి సాధించవచ్చున్నారు. లక్షల ఖర్చు పెట్టి పెట్టుబడి పెట్టి సాగు చేయడం వల్ల నష్టాలు సంభవించి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఖర్చులు తగ్గించి.. ఎక్కువ దిగుబడులు సాధించాలంటే సులభమైన పద్ధతిలో, సాంకేతిక పరిజ్ఞానంతో ఎరువులు వాడితే ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లేశ్వరి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ భార్గవి, గుత్తి ఎడిఎ వెంకటరాముడు, సీనియర్ సైంటిస్ట్ రేకులకుంట డాక్టర్ జి.నారాయణస్వామి, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సబిత, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లు : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజాశక్తి రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా అంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన వారు గొంతుకగా గలమెత్తడంలో ప్రజాశక్తి ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి అనంతపురం రూరల్ డివిజన్ ఇన్‌ఛార్జి తలారి రామాంజినేయులు, గుంతకల్లు ప్రజాశక్తి విలేకరులు బాపురం వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మాజీ ఎంపిపి ప్రతాప్‌నాయుడు, యుగంధర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటేసులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గంలోని వడ్డే బండ్ల కాలనీలో మంజునాథ (24) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు పోలీసుల విచారణలో తేలనుంది.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

గుత్తి : పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉండే రాజేష్ కుమార్ అనే ఉపాధ్యాయుడి ఇంటిలో మంగళవారం పగులే చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తన భార్య గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న తన భార్య తోపాటు తాను విధుల నిమిత్తం ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. ఇంటికి వచ్చిన రాజేష్‌కుమార్ చోరీ విషయాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న సీఐ బి. వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు మండల పరిధిలో వడ్డిపల్లి గ్రామంలో మండల వ్యాప్తంగా ఉన్న రైతులకు మంగళవారం వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీతో రైతులకు విద్యుత్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ముఖ్యంగా లోవోల్టేజ్ సమస్యలు లేకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలుపూరు విశ్వనాథరెడ్డి, మదిగుబ్బ లక్ష్మీనారాయణ, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వడ్డే నాగేంద్ర, వాల్మీకి సాధికార కమిటీ అధ్యక్షులు కందుల గుజ్జుల ఓబుళపతి, హిందూపురం నియోజకవర్గం అధికార ప్రతినిధి శ్యాంబాబు, కందల ఓబుళపతి, వడ్డే నాగేంద్ర, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణాలకు అంచనాలు తయారు చేయండి

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలకు అంచనాలు తయారు చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 43, 46వ డివిజన్ల పరిధిలో మేయర్ మహమ్మద్‌వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 46వ డివిజన్‌లోని ఇమామ్‌సాబ్ కాలువలో పూడిక తక్షణమే తీయించాలని ఆదేశించారు. కాలువలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలు ఏర్పాటుకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల మీద సిమెంటు పలకలు, స్లాబులు లేకపోవడంతో వెంటనే వాటిని ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. చిన్న చిన్న వీధుల్లో కూడా రోడ్ల మరమ్మతులు ఉంటే వెంటనే చేయాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు ఇషాక్, రాజేశ్వరి, సైఫుల్లాబేగ్, అబుసాలేహా, ఇఇ రాధాకృష్ణ, డిఇఇ నరసింహులు, ఎఇ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డ్రెయినేజీని పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం



జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

గుత్తి : చిన్నపాటి భూ సమస్యలు ఉంటే గ్రామాల్లోనే పరిష్కరించుకోవచ్చని అనంతపురం సంయుక్త కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం, మార్నేంపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెసి మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలపై తగాదాలకు దిగరాదన్నారు. భూ సమస్యలు ఉంటే అర్జీల రూపంలో రెవెన్యూ సదస్సుల్లో ఇస్తే పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.ఓబిలేసు, రీసర్వే ఉప తహశీల్దార్ శ్రీలత, రంగనాథ స్వామి ఆలయ ఈఓ కురబ నాగేంద్రుడు, గృహ నిర్మాణ శాఖ ఎఇ సూర్యనారాయణ, మండల సర్వేయర్ సాయి, వీఆర్వో టి.సురేంద్ర, మాజీ సర్పంచి శ్రీనివాస్ చౌదరి, టిడిపి నాయకుడు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీకి తక్షణ పరిష్కారం చేపుతామని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాయనవారిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేసిన తర్వాత ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. వీటికితోడు గ్రామంలో ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో సమర్పిస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, ఫారెస్ట్ ఆఫీసర్ రామ్మోహన్, ఎండోమెంట్ అధికారి గుర్రప్ప, సర్పంచు రమణమ్మ, టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, విఆర్‌ఓలు నాగేంద్ర, దాదాపీరా, ఇన్‌ఛార్జి సర్వేయర్ శివానంద, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పెద్దమాంబ ఊరు దేవర

బెలుగుప్ప : మండల పరిధిలోని జీడిపల్లి గ్రామంలో రెండు రోజులపాటు నిర్వహించిన పెద్దమాంబ ఊరు దేవర మంగళవారం వైభవంగా ముగిసింది. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులు జంతుబలి ఇచ్చారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉరవకొండ రూరల్ సీఐ చిన్న గౌసు, బెలుగుప్ప ఎస్ఐ శివ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'పొలం పిలుస్తోంది'

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని వేల్పుమడుగు, మాలాపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, స్థానిక వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి శనగ పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులకు వ్యవసాయ సాగులో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. శనగ, కంది నిల్వ చేసుకునే పద్ధతులను వివరించడంతో పాటు కంది కొనుగోలు చేసుకొనుటకు మీ గ్రామాల్లో ఉన్న రైతు సేవాకేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎరువులను యాజమాన్య మట్టి నమూనా పరీక్షల ఆధారంగా వాడి, నేల సారం కాపాడుకుని, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, సర్పంచు తిప్పారెడ్డి, ఎఇఒ రాఘవేంద్ర, గ్రామ వ్యవసాయ సహాయకులు కుళ్లాయినాయిక్, రైతులు పాల్గొన్నారు.



పొలంబడిలో పాల్గొన్న అధికారులు

ప్రధాని పర్యటనను ప్రజలు వ్యతిరేకించాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పదేళ్లుగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున పిలుపునిచ్చారు. మోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని వినాయక కూడలిలో 'రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన మోదీ గో బ్యాక్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను నిర్మించి ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి పదేళ్లుగా మోసం చేశారన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా 10 సంవత్సరాల పాటు మోడీ ప్రభుత్వం ఏపీ ప్రజలకు ద్రోహం చేసిందని తెలిపారు. ప్రస్తుతం బిజెపి పాలన ఆంధ్రప్రదేశ్ ఎంపీల మద్దతుపై ఆధారపడి ఉందన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఉత కర్రలసాయంతో మూడోసారి కేంద్రంలో అధికారంలో ఉండి కూడా రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేస్తోందంటే అందుకు రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలే కారణమన్నారు. కావున ప్రతి ఒక్కరూ మోదీ పర్యటనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధు, తిమ్మరాజు, అంజి, నగేష్, నాయక్, బాబు, ఆంజనేయులు, నాగేంద్ర, సురేష్, రవి ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : రాష్ట్రంలోని విశాఖపట్నం పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ గ్యోబ్యాక్ అని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు శ్రీకారం చుట్టిన నరేంద్ర మోదీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదన్నారు. అలాగే విభజన చట్టంలోని ముఖ్యమైన ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అలాంటి మోదీ ఈనెల 8న రాష్ట్రానికి వస్తున్నారన్నారు. మోదీ పర్యటనకు వ్యతిరేకంగా గో బ్యాక్ నరేంద్ర మోదీ నినాదంతో సిపిఎం నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దన్న, రాము, ఆదినారాయణ, రామాంజనేయులు, మల్లికార్జున, నాగరాజు, ఎం.పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : దేశ ప్రధానమంత్రి మోదీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏముఖం పెట్టుకుని వస్తున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు ఎద్దేవా చేశారు. మంగళవారం ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గో బ్యాక్ మోడీ అంటూ స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్రాభివృద్ధికి అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర పర్యటనకు వస్తున్నారన్నారు. ప్రజలందరూ మోదీ పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, జగ్గిలి రమేష్, రంగమ్మ, సురేంద్ర, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామునాయక్, ఓబులేసు, షాషా, జాకీర్, ప్రజాసంఘాల నాయకులు చొక్కా సునీల్, వెంకీ, హరి, రాము, ఖాదర్, ఈరన్న, రామయ్య, మంజు, రామాంజి, మక్బూల్, హుసేన్, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

గుత్తి : రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ గుత్తిలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి సిపిఎం నాయకులు ప్రదర్శనగా గాంధీ కూడలికి చేరుకున్నారు. అక్కడ నాయకులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రత్యేక హోదా అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏపీకు అన్యాయం చేసిందన్నారు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రామకష్ణ, యు.మల్లికార్జున,ఎం.మల్లేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జెసి క్రికెట్ టోర్నమెంట్



తాడిపత్రి జర్నలిస్టు టీమ్‌కు బ్యాట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న జెసి క్రికెట్ టోర్నమెంట్‌లో పోటీలు హోరాహోరీగా నడుస్తున్నాయి. ఇందులో భాగంగా మొదటి మ్యాచ్ సునామి సూపర్ స్ట్రైకర్స్ వర్సెస్ టైగర్ టైటాన్స్ తాడిపత్రి మధ్య సాగింది. మొదట టాస్ గెలిచిన టైగర్ టైటాన్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది సునామీ సూపర్ స్ట్రైకర్స్ నిర్ణీత 8 ఓవర్లలో 109 పరుగులు సాధించింది 110 విజయ లక్ష్యంతో బరిలోకికి దిగిన టైగర్ టైటాన్స్ 58 పరుగులు సాధించి విజయం సాధించింది. రెండోమ్యాచ్‌లో జర్నలిస్టు తాడిపత్రి వర్సెస్ ఆధార్ కార్డ్ లెవెన్ మధ్య సాగింది. మొదట తాడిపత్రి జర్నలిస్టు బ్యాటింగ్ ఎంచుకున్నఇ 56 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ దిగిన ఆధార్ కార్డు లెవెన్ జట్టు కేవలం 4.5 ఓవర్లలో విజయం సాధించింది. మూడో మ్యాచ్ ఎస్ఎస్వీ లెవెన్ వర్సెస్ బిఎంబి బాయ్స్ మధ్య జరిగింది ఎస్ఎస్వీ లెవెన్ మొదట బ్యాటింగ్ చేసి 73 పరుగులు సాధించింది. బిఎంబి బాయ్స్ జట్టు కేవలం 5.5 ఓవర్లలో ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం గ్రామాల జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి.

యువశక్తితోనే దేశ పురోభివృద్ధి

రాయదుర్గం : భారతదేశ పురోభివృద్ధిలో యువశక్తి కీలకపాత్ర వహిస్తుందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం రాయదుర్గంలో నిర్వహించిన అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఫ్) జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడుతూ యువతను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన భూమిక వహించిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వం పుట్టిన అతి తక్కువ పార్టీల్లో కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత కలిగిన వ్యక్తులకు నిలయంగా ఉండేదన్నారు. కమ్యూనిస్టు పార్టీల్లో పని చేసిన వారు ధైర్యంగా ముందడుగు వేయగల శక్తిని అందుకుంటారన్నారు. నేటి యువశక్తి తగిన తర్ఫీదుతో అవకాశాలను అందిపుచ్చుకోటానికి సిద్ధం కావాలని సూచించారు. ఈ మహాసభల్లో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సంతోష్‌కుమార్, ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, తాలూకా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.


అభివృద్ధి లేనప్పుడు..బడ్జెట్ ఆమోదం ఎందుకు..

టిడిపి కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపాలిటీలో తమ పదవీకాలం ఏడాది ఉందని, ఇప్పటి వరకూ పూర్తయిన టెండర్ల పనులు జరగడం లేదని.. అలాంటప్పుడు బడ్జెట్ ఆమోదం ఎందుకు చెప్పాలని టిడిపి కౌన్సిలర్ పవన్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ సమావేశ భవనంలో ఛైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, 2024-25 ఆర్థిక ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా అమౌంట్ అధికారిణి ఎజెండా చదివారు. అంతలో మైక్ అందుకున్న టిడిపి కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గతేడాది బడ్జెట్‌లో ఆమోదం తెలిపి తదుపరి నెలల సమావేశాల్లో కౌన్సెల్ ఆమోదం తెలిపిన పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయన్నారు. అయితే ఆ పనులే ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కౌన్సిల్ ఎన్నికలకు ఏడాది సమయం మాత్రమే ఉండగా కొత్త పనులు ఎప్పుడు చేపడతారని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశాలు కాలం వృథా చేయడానికి తప్ప పట్టణాభివృద్ధికి పనికిరావడం లేదని పవన్‌కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేస్తూ సమావేశాన్ని బాయికాట్ చేసి బయటికి వెళ్లిపోయారు. అనంతరం సమావేశాన్ని ఛైర్‌పర్సన్ భవాని యథావిధిగా కొనసాగించారు. మరో టిడిపి కౌన్సిలర్ కృపాకర్ బడ్జెట్‌లో అనేక అంశాలు ఉన్నాయని వాటిలో కొన్ని అంశాలకు నిర్ధారణ ఇవ్వాలని కోరారు. అనంతరం బడ్జెట్ ఆమోదం చేస్తున్నట్లు ప్రకటించారు.

రూ.50.04 కోట్ల మిగులు బడ్జెట్‌కు కౌన్సెల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

2025-26 ఆర్థిక ఏడాది బడ్జెట్ అంచనాలతోపాటు 2024-25 ఏడాది సవరించిన అంచనాలతో అధికారులు రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సెల్ ఆమోదం తెలిపింది. గతేడాది మిగులు బడ్జెట్ రూ 48,95,07,690ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.47,57,70,000 సాధారణ,వ ూలధనం జమల అంచనాలు కలుపుకుని 96,52,77,690 రూపాయలు ఈ ఏడాది ప్రారంభ నిల్వగా చూపారు. 2025-26 ఆర్థిక ఏడాదిలో సాధారణ, మూలధనం ఖర్చులు రూ.46,48,40,000 అంచనాలు రూపొందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నిల్వల్లో ఖర్చులు పోనూ రూ.50,04,37,690 (50.05 కోట్లు) మిగులు బడ్జెట్‌గా అధికారులు చూపగా కౌన్సెల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీరు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన

బుక్కరాయసముద్రం : అయోడిన్ లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్టులో భాగంగా ఐటీసీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అయోడిన్ లోపం వల్ల కలిగే అనార్థాలను డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసుంధరాదేవి, ఎంపిపి సునీత, సర్పంచు పార్వతి, ఎంఇఒ నదిమా, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది రామాంజి, డిస్టిక్ కో ఆర్డినేటర్ దరగయ్య, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపిపి సునీత